పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి



వార్డుల్లో నిరంతరం విధులు నిర్వహించే నర్సింగ్ సిబ్బందిపై రోగుల అటెండెంట్స్ ఎప్పుడూ దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ప్రతి రోగికి నాణ్యమైన సేవలు అందేలా నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. రోగి వద్ద ఎక్కువగా అటెండెంట్స్ ఉన్నప్పుడు బయటకు వెళ్లమంటే సిబ్బందితో గొడవకు దిగుతుంటారు. ఇవి నిత్యకృత్యంగా మారాయి. అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలి.

– హేమకల్యాణి, రిటైర్డ్ హెడ్‌నర్సు



కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా చూడాలి

ఘటనలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కన్నా కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఎంతో మంది ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులకు మరింత రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైద్యులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజానీకం పరిస్థితి ఏమిటి.? వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ కోసం చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలి.

–డాక్టర్ చల్లా హరికుమార్, చిన్న పిల్లల వైద్యనిపుణుడు



క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (విజయవాడ టౌన్) బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్డు, హైవే రోడ్డు (వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు), ఆశ్రమం రోడ్డు, బేతపూడి అరుణకుమారి రోడ్డు, బాజీ బాబా మందిరం రోడ్, సభాపతి రోడ్డు, ఔట్ ఏజెన్సీ, మీరా సాహెబ్ వీధి ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయాల్లో కరెంట్ ఉండదని వివరించారు.

- చిట్టినగర్ సెక్షన్, కేఎల్‌రావు నగర్ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ ఫోర్మెన్ బంగళా ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరగనున్నాయి. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఫోర్మెన్ బంగళా ఏరియా, యూసఫ్‌ఖాన్ వీధి, ప్రైజర్ పేట, ఎర్రకట్ట ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికపై హర్షం

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడిగా గొర్లె చక్రపాణి, కార్యదర్శిగా నంబ్లశ రమేష్‌నాయుడు ఎన్నిక కావడంపై బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్(రాజా) హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 14వ తేదీన విజయవాడలోని ల్యాండ్ అక్విజేషన్ కోర్టులో జరిగిన ఎన్నికల్లో వీరి ప్యానల్ విజయం సాధించినట్లు తెలిపారు. అధ్యక్షులుగా ఎన్నికైన గొర్లె చక్రపాణి గుంటూరు ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా, కార్యదర్శిగా ఎన్నికైన నంబ్లశ రమేష్‌నాయుడు కాకినాడ మూడో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. వారిద్దరూ ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థులని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

బదిలీల్లో ఉద్యోగుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలి



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని సవరించిన నేపథ్యంలో ఉద్యోగుల అభ్యర్థనను ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోవాలని రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కె.వి.వి.నాగ మురళి కోరారు. ఈ మేరకు సంయుక్త రవాణా కమిషనర్ ఎస్.శివరామప్రసాద్‌కు శుక్రవారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు బాధపడుతున్నారని, ఆస్పత్రుల్లో చికిత్స పొందడానికి వీలుగా అనువైన ప్రాంతంలో బదిలీకి అవకాశం కల్పించాలని, ఏడాది లోపు ఉద్యోగ విరమణ చేసే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లోని కార్యవర్గ సభ్యులకు బదిలీల మినహాయింపు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం కాకినాడకు చెందిన శ్రీజ్యోతి నృత్య కళానికేతన్‌కు చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. నృత్య కళానికేతన్‌కు చెందిన చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యాన్ని ప్రదర్శించారు. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను భక్తులు అభినందించారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు

ఇంద్రకీలాద్రిపై ఆరో అంతస్తులో స్పృహ కోల్పోయిన భక్తురాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఓ భక్తురాలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తూ స్పృహ కోల్పోయారు. ఆ భక్తురాలిని ఆలయ సిబ్బంది కుర్చీలో కూర్చోపెట్టి ఆలయ ప్రాంగణంలోని ఆస్పత్రికి తరలించారు. ఆమె అరికాళ్లు, చేతులు చల్లబడుతుండగా, ఆలయ సిబ్బంది పరిస్థితి విషమించకుండా చూశారు. ఆస్పత్రిలోని డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో హుటాహుటిన దేవస్థాన అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వ్రతంలో కూర్చుని ఉన్న భక్తురాలు ఉదయం అల్పాహారం తీసుకోకపోవడంతో నీరసంతో స్పృహ కోల్పోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ భక్తురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. పండుగలు, పర్వదినాల సమయంలోనూ, భక్తుల రద్దీ అధికంగా ఉన్న తరుణంలో కూడా ఆలయ పరిసరాల్లో ఉండాల్సిన వైద్యుడు ఎక్కడికి వెళ్లారనేది భక్తుల ప్రశ్నగా మారింది

ఆలయాల్లో శ్రావణ సందడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. ఆలయ ప్రాంగణంలోని మహామండపం ఆరో అంతస్తులో ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తికి ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పూజలు చేశారు. తొలుత ఆర్జిత సేవగా రూ. 1500 టికెటు కొనుగోలు చేసిన భక్తులతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపించారు. ఈ సేవలో 62 టికెట్లను దేవస్థానం విక్రయించింది. ఇక ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపించగా, సుమారు ఐదు వందల మంది మహిళలు వ్రతంలో పాల్గొన్నారు. ఆలయ డీఈవో లీలాకుమార్, ఏఈవో ఎన్. రమేష్ బాబు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, సహస్ర కుంకుమార్చనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ జరిగింది. భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడాయి. మహా మండపం దిగువన, లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఖడ్గ మాలార్చనలో పురందేశ్వరి

తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గ మాలార్చనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

పాతబస్తీలో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రావణ శుక్రవారం సందర్భంగా పాతబస్తీలోని ఆలయాలు కిటకిటలాడాయి. శుక్రవారం ఆలయాల్లో విశేష పూజలను నిర్వహించారు. పాతబస్తీలోని శైవాలయాలతో పాటుగా వైష్ణవాలయాలు రద్దీగా దర్శనమిచ్చాయి. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు.

పాతబస్తీలోని పురాతన ఆలయం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని సామూహిక లక్ష కుంకుమార్చన చేశారు. 108 మంది దంపతులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని భ్రమరాంబ అమ్మవారు గౌరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో జరిగిన కుంకుమార్చనలో జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతి పాల్గొని పూజలు నిర్వహించారు.



శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తజనం



మహామండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వెంకన్న సన్నిధిలో..

వన్‌టౌన్‌లోని శ్రీ పద్మావతి అమ్మవారికి పూలంగిసేవను శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. బ్రాహ్మణవీధి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి ప్రత్యేకంగా పూలంగి సేవ చేశారు.

ఈ సందర్భంగా వివిధ రకాల పూలతో అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు చేశారు. వైదిక కార్యక్రమాలను అర్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): కేదారేశ్వర పేటలోని శ్రీశివకాశేశ్వరీదేవి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజలు చేశారు. శ్రీశివకాశేశ్వరీదేవికి విశేష పుష్పాలంకరణ చేసి పంచ హారతులు ఇచ్చారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నుదురుమాటి కృష్ణప్రసాద్ శర్మ, సహాయ అర్చకులు రెంటచింతల కాశీ విశ్వనాథ శర్మలు పలువురు ఉభయదాతలు, భక్తుల పేరిట కుంకుమార్చనలు నిర్వహించారు.



ప్రత్యేక పూల అలంకరణలో పద్మావతిదేవి



విశేష అలంకారంలో మహాలక్ష్మీదేవి

సమష్టి కృషితో విజయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమష్టి కృషితో విజయం సాధిస్తామని ఇస్రో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మూర్తి అన్నారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఇస్రో సీనియర్ సైంటిస్ట్, గగన్‌యాన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ మూర్తి రేమిళ్ల శుక్రవారం ఆన్‌లైన్‌లో సంభాషించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అంతరిక్ష విజ్ఞానం, ఇస్రో, మన దేశం సాధించిన విజయాలు, భవిష్యత్‌లో చేపట్టనున్న ప్రాజెక్ట్స్, లక్ష్యాలను వివరించారు. చంద్రయాన్ విజయం వెనక అనేక విభాగాల సిబ్బంది, శాస్త్రవేత్తల సమష్టి కృషితోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ఒక్కోసారి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సాంకేతికంగా అనివార్య పరిస్థితుల్లో విఫలం కావచ్చని తెలిపారు. ఆ వైఫల్యాలను గుర్తించి విజయం వైపు పయనించాలని సూచించారు. స్కూల్ హెచ్‌ఎం మాతంగి కోటయ్య మాట్లాడుతూ తెలుగువారైన మూర్తి ఈ స్థాయికి చేరుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. ఆ స్థాయిలో ఉండి కూడా తమ పాఠశాల విద్యార్థులతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా మాట్లాడటం వారి జీవితంలో మరుపురాని సంఘటనగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, జ్యోతిర్మయి, శివపార్వతి, నాగరాజు, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల ధర్నా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య హక్కులను హరించే నూతన క్రిమినల్ చట్టాల అమలును వెంటనే నిలుపు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో శనివారం నిరసన చేపట్టనున్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, కాంగ్రెస్ లీగల్ సెల్, ఏపీసీఎల్ఏ, సీఎల్‌సీ, ఐఏపీఎల్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్‌ల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాలో న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయా సంఘాల ప్రతినిధులు కోరారు.

దోమల నివారణకు ఫ్రైడే.. డ్రైడే

నగరంలో అవగాహన కార్యక్రమాలు

పటమట(విజయవాడతూర్పు): దోమల నివారణపై వీఎంసీ అధికారులు నగరవాసులకు అవగాహన కల్పించారు. ఫ్రైడే–డ్రైడే సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు, మైక్ ప్రచారం చేశారు. ప్రజారోగ్య విభాగం శానిటరీ సెక్రటరీలు 64 డివిజన్లలో వర్షం నీటి నిల్వలు పెరుగుతుండటంతో దోమల లార్వాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దోమలపై నిర్లక్ష్యంగా ఉండొద్దని, వాటితో మలేరియా, చికున్‌గున్యా, డెంగీ జ్వరాల బారిన పడకుండా ఉండటానికి వీఎంసీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే– డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. హెల్త్ సెక్రటరీలు ప్రతి ఇంటికీ వెళ్లి నిల్వ నీటితో ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. నెహ్రూనగర్, కొత్తపేట, వించిపేట తదితర ప్రాంతాల్లో కొబ్బరి బొండాలు, రుబ్బురోలు, కూలర్లు, పూల కుండీలు, తొట్టెలులాంటివి ప్రతి శుక్రవారం శుభ్రపరచుకోవాలన్నారు. అలా చేస్తే దోమలు లార్వా పెట్టే అవకాశం ఉండదని, దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానికులకు వీఎంసీ అధికారులు అవగాహన కల్పించారు. వీటితోపాటు డివిజన్లో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని కల్వర్టుల్లో, వీధుల్లో ఫాగింగ్ చేయటం, మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్ లలో డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేశారు.



ఫ్రైడే డ్రైడే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వీఎంసీ సిబ్బంది

ఖాళీ స్థలాల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): గట్టు వెనుక ప్రాంతంలోని 45వ డివిజన్ పరిధిలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో లార్వాను గుర్తించి డ్రోన్ కెమెరా ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మలేరియా–2 సిబ్బంది శుక్రవారం డివిజన్‌లోని ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఈ క్రమంలో మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్ కెమేరాను పంపి నిల్వ ఉన్న నీళ్లల్లో లార్వా ఉందీ లేనిదీ తెలుసుకున్నారు. అనంతరం ఎక్కడైతే లార్వా ఉందని గుర్తించారో అక్కడ డ్రోన్ కెమెరా ద్వారా ఎంఎల్ ఆయిల్‌ను పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా సిబ్బంది మాట్లాడుతూ దోమలను లార్వా దశలోనే నిర్మూలిస్తే ప్రజలు దోమ కాటుకు గురి కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వ్యక్తి అదృశ్యంపై శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్యసాయిజిల్లా పుట్టపర్తికి చెందిన హరిజన ముత్యాలప్ప కుటుంబం నివసిస్తోంది. అతనికి కొడుకు హరిజన నరసింహులు (54) వివాహం కాగా ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్నేళ్ల క్రితం కుటుంబంలోని మనస్పర్థల కారణంగా నరసింహులు భార్యతో విడిపోయి తండ్రి వద్దే ఉంటున్నాడు. అతని మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ముత్యాలప్ప బెంగళూరులో చికిత్స అందిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన కొడుకును తీసుకుని విజయవాడలోని అమ్మవారి దర్శనం కోసం గుడికి వచ్చారు. దర్శనం అనంతరం కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో తన కొడుకు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెదికినా ఆచూకీ లభించలేదు. పలుచోట్ల విచారణ చేసినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి శుక్రవారం విజయవాడ చేరుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేటి తరానికి ఆదర్శం.. టంగుటూరి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపంలోని టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులు ప్రకాశం పంతులని గుర్తు చేశారు. దేశం కోసం న్యాయవాది వృత్తిని వీడి తన ఆస్తిని స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ తెల్లదొరల తుపాకి గుండ్లకు ఎదురొడ్డి నిలిచి తన గుండెను చూపిన ధీశాలి ప్రకాశం పంతులని పేర్కొన్నారు. ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా చేసిన స్వల్ప కాలంలోనే కృష్ణా డెల్టా ఆయకట్టును స్థిరీకరించే రీతిలో నేటి ప్రకాశం బ్యారేజి నిర్మాణానికి బీజం వేసిన రైతు శ్రేయోభిలాషి అని కొనియాడారు. ఆయన ప్రారంభించిన స్వరాజ్య పత్రిక స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్ర ప్రజల అకుంఠిత ధైర్య సాహసాలకు, అసమాన త్యాగనిరతికి టంగుటూరి ప్రతీకగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, పలువురు నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, ఇతర నేతలు

27, 28 తేదీల్లో కాస్మో క్రూయిజ్

కేబీఎన్‌లో భారత అంతరిక్ష ప్రయాణంపై ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సాధించిన విజయాలను వివరించడానికి ఈ నెల 27, 28 తేదీల్లో కాస్మోక్రూయిజ్ పేరుతో ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాకరపర్తి భావనారాయణ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా ముద్రించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో నిర్వహించారు. పోస్టర్‌ను ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య ఆవిష్కరించారు. అనంతరం తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పంపిన తొలి ఉపగ్రహం ఆర్యభట్ట నుంచి ఇటీవల పంపిన చంద్రయాన్–3 వరకూ సాధించిన విజయాలు, ఇస్రో ప్రయాణం, వాటితో మానవాళికి కలిగిన ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన ప్రదర్శనను ఈ నెల 27, 28 తేదీల్లో కేబీఎన్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇస్రో నుంచి వచ్చే నిపుణులు, వివిధ మోడల్స్‌తో కూడిన ప్రత్యేక వాహనం తమ కళాశాలకు చేరుకుంటుందన్నారు. వాటిలో ఆయా ఉపగ్రహాల నమూనాలతో పాటు వీడియోలు విద్యార్థులకు ప్రదర్శించి అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల నుంచి విద్యార్థులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపైన మక్కువ పెంచుకుని అవగాహనను పెంపొందించుకోవటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. దీంతో భవిష్యత్తులో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగడానికి అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ కోశాధికారి ఎం హరగోపాల్, హిందూహైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు తదితరులు

129 మందికి ఉచిత కంటి పరీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ మానవ హక్కులు, నేర నియంత్రణ బ్యూరో (ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ) ఆధ్వర్యాన శుక్రవారం భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని మాసిదోనియా గాస్పెల్ మినిస్ట్రీ హాల్‌లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 129 మంది కాలనీ వాసులకు కంటి పరీక్షలు చేశారు. నగరంలోని మ్యాక్సి విజన్ ఐ హాస్పటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన త్ర వైద్య శిబిరంలో పరీక్షల అనంతరం అవసరమైనవారికి మందులు, ఐ డ్రాప్స్ ఉచితంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పద్మజ పురాణం మాట్లాడుతూ కళ్లు మనకు దేవుడు ఇచ్చిన అపురూపమైన వరమని, వాటిని అత్యంత జాగ్రత్తగా చూసుకోవడం ప్రతి ఒక్కరి విధి అన్నారు. టీవీ, మొబైల్ ఫోన్ల యుగంలో పిల్లలకు కూడా చూపు మందగిస్తుండటం బాధాకరమని పేర్కొన్నారు. కళ్లు మసకగా కనిపిస్తే వెంటనే కంటి డాక్టర్ దగ్గరకు వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సకాలంలో శుక్లాలకు శస్త్రచికిత్స చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జె.చైతన్య నివాస్, హైకోర్ట్ న్యాయవాది ఎస్‌కే అల్లాభక్షు, మ్యాక్సి విజన్ హాస్పటల్ అసిస్టెంట్ మేనేజర్ కె నారాయణ, ఆప్తమాలజిస్ట్ నాగేశ్వర రావు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది





ఇంద్రకీలాద్రిపై యథేచ్ఛగా సెల్‌ఫోన్ల వినియోగం

ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి ఆవరణలో సెల్‌ఫోన్ల నిషేధం అమలు కావడం లేదు. గుడి ఆవరణలో యథేచ్ఛగా సెల్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలోకి సెల్‌ఫోన్ల నిషేధం ఉన్నా, శుక్రవారం ఆ ఆవరణలోకి సెల్‌లు తీసుకొచ్చి భక్తులు సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ కనిపించడంతో 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



లలితా సహస్ర నామం సర్వశ్రేయోదాయకం

విజయవాడ కల్చరల్: శ్రీ లలితా సహస్ర నామం సర్వశ్రేయోదాకమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి అన్నారు. బ్రాహ్మణసేవా సంఘం, దాతల సహకారంతో సత్యనారాయణపురంలోని పాదుకా క్షేత్రంలో శుక్రవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, లలితా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ లలితా సర్వదేవాలకు పూజనీయమైనదని తెలిపారు. 119 మంది మహిళలు లలితా సహస్ర నామ పారాయణం, లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. వేదపండితులు మురళీశ్రీనివాస్, బ్రాహ్మణ సేవ సంఘం కార్యదర్శి తణుకు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.